క్లుప్తంగా

కొనసాగుతున్న పీజీ, బీఈడీ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో కొనసాగుతున్న పీజీ, బీఈడీ సెమిస్టర్‌ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం జరిగిన పీజీ 2, 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 1,785 మంది విద్యార్థులకు గానూ 1,717 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం బీఈడీ, బీపీఎడ్‌ 2, 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో మొత్తం 1,441 మంది విద్యార్థులకు గానూ 1,397 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. తెయూ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్‌ యాదగిరి తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్‌ మామిడాల ప్రవీణ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ లక్ష్మణ చక్రవర్తి, అడిషనల్‌ కంట్రోలర్‌ సాయిలు, పీఆర్వో పున్నయ్య తదితరులున్నారు.

ఐటీఐ (ఏటీసీ) కేంద్రాలలో ప్రవేశాల సంఖ్య పెంచాలి



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలు, అడ్వాన్స్‌ టెక్నాలజీ సెంటర్లలో యువతీ, యువకుల ప్రవేశాల సంఖ్యను పెంచాలని, వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్‌ అంకిత్‌ అధికారులకు సూచించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో గురువారం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఐటీఐలు, ఏటీసీ కేంద్రాలలో ప్రవేశాల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామగ్రామాన ఏటీసీ కేంద్రాల గురించి తెలియజేస్తూ, ఈ నెల 28లోపు అర్హులైన వారు స్పాట్‌ అడ్మిషన్లు పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. స్పాట్‌ అడ్మిషన్లకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. నిజామాబాద్‌ ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్‌ యాదగిరి, బోధన్‌ ఐటీఐ ప్రిన్సిపాల్‌ శాంతారాం, కమ్మర్పల్లి ఐటీఐ ప్రిన్సిపాల్‌ కోటిరెడ్డి, భీంగల్‌ ఐటీఐ సీనియర్‌ అసిస్టెంట్‌ దామోదర్‌చారి, సంతోష్‌ కుమార్‌ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో న్యాయశాస్త్రం పాత్ర కీలకం



తెయూ(డిచ్‌పల్లి): సమాజ నిర్మాణంలో న్యాయ శాస్త్రం పాత్ర కీలకమైనదని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ యాదగిరి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ న్యాయ శాస్త్ర ఫైనలియర్‌ విద్యార్థులకు గురువారం మూట్‌ కోర్ట్‌ నిర్వహించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్‌ మాట్లాడుతూ.. న్యాయ శాస్త్ర విద్యార్థులకు మంచి భవిష్యత్‌ ఉందన్నారు. మూట్‌కోర్టులో న్యాయమూర్తిగా వ్యవహరించిన నిజామాబాద్‌ న్యాయవాది వెంకటేశ్వర్లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కొంతమంది విద్యార్థులు రిజర్వేషన్స్‌కు అనుకూలంగా, మరికొందరూ ప్రతికూలంగా వాదనలు విన్పించారు. చివరగా న్యాయమూర్తి రిజర్వేషన్స్‌ అనివార్యంగా కొనసాగించాలని తీర్మానించారు. బీవోఎస్‌ చైర్మన్‌ స్రవంతి, అధ్యాపకులు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు!

- అర్హుల గుర్తింపు కోసం 23 నుంచి రెవెన్యూ డివిజన్ల వారీగా శిబిరాలు
- వైద్య పరీక్షలు నిర్వహించనున్న అలిమ్‌కో ప్రతినిధులు



దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్‌)

ఆర్మూర్‌: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల (దివ్యాంగులకు)కు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించనున్నారు. ఇందుకోసం అర్హులను గుర్తించడానికి శిబిరాలను తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్మూర్‌, బోధన్‌, నిజామాబాద్‌లో మూడు శిబిరాల నిర్వహణకు ఉన్నతాధికారులు అనుమతులనిచ్చారు. శారీరక వైకల్యం, మానసిక వైకల్యం, వినికిడిలోపం, అంధత్వంతో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన వీల్‌ చైర్స్‌, చంక కర్రలు, ట్రై సైకిళ్లు, రొలేటర్స్‌, బ్రెయిలీ కిట్‌, బ్రెయిలీ ప్లేట్స్‌, ఎమ్మార్‌ కిట్‌లతో పాటు కృత్రిమ అవయవాలు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆర్టిఫిషియల్‌ లింబ్స్‌ మానిఫ్యాక్చరింగ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (అలిమ్‌కో) సహకారంతో ఈ శిబిరాలను నిర్వహించడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా ఉన్న 4,125 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో సుమారు 500 మందికి పరికరాలు అవసరం ఉన్నట్లు ఇన్‌క్లూసివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ పర్సన్‌ (ఐఈఆర్పీ)లు గుర్తించారు. వీరిని శిబిరాలకు తరలించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. శిబిరానికి వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్రావలింగ్‌ అలవెన్స్‌ (టీఏ), భోజన సదుపాయం కల్పించనున్నారు.

ఏమేమి తీసుకొనిరావాలి..

సున్నా నుంచి 18 సంవత్సరాల ఏళ్లలోపు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మాత్రమే ఈ శిబిరాలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇన్‌కం సర్టిఫికెట్‌, సదరం సర్టిఫికెట్‌, యూడీఐడీ కార్డు, తెల్లరేషన్‌ కార్డు, ఆధార్‌ కార్డు జిరాక్స్‌లతోపాటు మూడు పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫోటోలతో శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. సదరం సర్టిఫికెట్‌లేని సందర్భంలో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుని చే ధృవీకరించిన పత్రంపై ఎంఈవో లేదా ప్రధానోపాధ్యాయుడి అటెస్టేషన్‌ చేపించుకొని తీసుకొని రావాల్సి ఉంటుంది.

అలిమ్‌కో ప్రతినిధులు అర్హులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సిఫార్సు చేస్తారు. 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు, 40 శాతం సహిత విద్యా విభాగం నిధులు వెచ్చించి పరికరాలను సమకూర్చుకొని ఎంపిక చేసిన లబ్ధిదారులకు త్వరలో అందజేస్తారు. రాయితీపై అందజేసే బస్‌ పాస్‌ను సైతం ఈ శిబిరంలో అందజేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శిబిరం వేదికలు:

23న: సీఎస్‌ఐ హెచ్‌పీడీ బదిరుల పాఠశాల, సీఎస్‌ఐ కాంపౌండ్‌, ఆర్మూర్‌
25న: ప్రభుత్వ జేసీ హైస్కూల్‌, బోధన్‌
26న: న్యూ ఎస్‌ఎస్‌ ఫంక్షన్‌ హాల్‌, న్యూహౌజింగ్‌ బోర్డు కాలనీ(కేసీఆర్‌ కాలనీ), నిజామాబాద్‌

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వివిధ వైకల్యాలతో బాధపడుతున్న పిల్లలకు పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఉచితంగా అందజేస్తున్నాము కాబట్టి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– అశోక్‌, డీఈవో, నిజామాబాద్‌

త్వరలో పంపిణీ చేస్తాం.



దివ్యాంగులకు అలిమ్‌కో ప్రతినిధులు అవసరమైన పరికరాల గుర్తింపు పరీక్షలు నిర్వహించి, అర్హులను గుర్తిస్తారు. వారికి పరికరాలను అతి త్వరలో ఉచితంగా అందజేస్తాము. పరికరాల అందజేత సమచారాన్ని అర్హులకు తెలియజేస్తాం. – పడకంటి శ్రీనివాస్‌రావు, సహిత విద్యావిభాగం జిల్లా ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌

పిన్‌కోడ్‌లో ఆరు అంకెల రహస్యం

మీకు తెలుసా?



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): తపాలా కార్యకలాపాల్లో పిన్‌కోడ్‌ నంబరులు కీలక పాత్ర పోషిస్తాయి. తపాలా శాఖ పరిధిలో ఉత్తర ప్రత్యుత్తరాలు చేసేందుకు ఆరు అంకెల పిన్‌కోడ్‌ను ఉపయోగిస్తారు.

- చాలా ఏళ్లుగా ఉత్తరాలు, వస్తువులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పంపడంతో పాటు ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌ మార్కెటింగ్‌ కార్యకలాపాలు పిన్‌ కోడ్‌ ఆధారంగా కొనసాగిస్తున్నారు.
- మన దేశంలో 1972 ఆగస్టు 15 నుంచి పిన్‌కోడ్‌ నంబరు వినియోగంలోకి వచ్చింది.
- పిన్‌కోడ్‌ నంబర్ల ఆధారంగా వినియోగదారులకు తపాలా సేవలు అందుబాటులోకి వచ్చాయి.
- ఆరు అంకెలా పిన్‌కోడ్‌లో మొదటి అంకె జోన్‌ను, రెండో అంకెను సర్కిల్‌ను, మూడో అంకె జిల్లా చివరి మూడు అంకెలు తపాలా కార్యాలయం ఉన్న ప్రాంతంను సూచిస్తాయి. –ప్రధాన తపాలా కార్యాలయంతోపాటు ఉప తపాలా కార్యాలయాలకు కూడా పిన్‌కోడ్‌ నంబర్లను కేటాయించారు.

పర్యావరణంపై ఎకోమిత్ర పోటీలు

- విద్యార్థులు మొక్క నాటి ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేయాలి
- ఆగస్టు 27వరకు పోటీల నిర్వహణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): విద్యార్థులకు పర్యావరణం పట్ల సరైన అవగాహన కల్పించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా జాతీయ విద్యార్థుల పర్యావరణ్‌ కాంపిటీషన్స్‌ (ఎన్‌ఎస్‌పీసీ)లు నిర్వహిస్తోంది. 'హరిత–ద వే ఆఫ్‌ లైఫ్‌' అనే థీమ్‌ ఆధారంగా ఈ పోటీలను ఆగస్టు 27 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొక్కలను నాటడం, వ్యర్థాలను వేరు చేయడం, వాతావరణంలో పొంచిఉన్న ప్రమాదాలను లోతుగా అర్థం చేసుకునేందుకు విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పాల్గొనేలా విద్యాశాఖ ప్రయత్నాలు చేస్తోంది.

ఐదు గ్రూపులుగా..

ఈ పర్యావరణ పోటీల్లో 1వ తరగతి నుంచి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఎకోమిత్రం యాప్‌ ద్వారా గానీ ఎన్‌ఎస్‌పీసీ వెబ్‌సైట్‌ ద్వారా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలి. హిందీ, ఇంగ్లీష్‌తో పాటు తెలుగు భాషలో క్విజ్‌ పోటీ ఉంటుంది. 1వ తరగతి నుంచి 5వరకు, 6–8 వరకు, 9–12 తరగతుల వరకు మూడు గ్రూపులు ఉంటాయి. యూజీ, పీజీ పరిశోధకులు నాలుగవ గ్రూపులో, ఇతరులకు ఐదవ గ్రూపులో అవకాశం కల్పించారు. విద్యార్థులు మొక్కలు నాటి స్వీయచిత్రం గాని, మొక్కలు నాటిన చిత్రాలను యాప్‌ లేదా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేసి క్విజ్‌ పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులందరికీ ఈ–సర్టిఫికెట్లు అందజేస్తారు. జాతీయస్థాయి క్విజ్‌ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి నగదు పారితోషికంతోపాటు 'జాతీయ హరిత విద్యార్థి' అవార్డుకు అర్హత పొందవచ్చు. అయితే తగినంత ప్రచారం లేక విద్యార్థులు రిజిస్ట్రేషన్‌ చేసుకోలేకపోతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఈ పర్యావరణ మిత్ర పోటీలలో విద్యార్థులు పాల్గొనడం వల్ల పర్యావరణంపై అవగాహన పెరుగుతుంది. మా పాఠశాలలో కొందరు విద్యార్థులు నమోదు చేసుకున్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మొక్కలు నాటుతున్న ఛాయాచిత్రాన్ని ఎన్‌ఎస్‌పీసీ వెబ్‌సైట్‌ లో అప్‌లోడ్‌ చేసి సర్టిఫికెట్‌ పొందాలి.

–అంకం నరేష్‌, ఎల్‌ఎఫ్‌ఎల్‌ హెచ్‌ఎం, రేకులపల్లి

అందరూ పాల్గొనవచ్చు

పర్యావరణ క్విజ్‌ పోటీల్లో రాష్ట్రస్థాయిలో నిజామాబాద్‌ జిల్లా రెండవ స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో 10వ స్థానంలో ఉన్నాం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్‌ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులందరూ పోటీల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలి. విద్యార్థులతోపాటు టీచర్లు, పౌరులు కూడా పోటీల్లో పాల్గొనవచ్చు.

–గంగాకిషన్‌, జిల్లా సైన్స్‌ అధికారి

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్‌ భరతలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్‌ భరతలక్ష్మి

నిజామాబాద్‌ లీగల్‌ : జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 250 కేసులను మీడియేషన్‌ ద్వారా పరిష్కరించేందుకు గుర్తించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్‌ భరతలక్ష్మి పేర్కొన్నారు. మీడియేషన్‌ ఫర్‌ నేషన్‌లో భాగంగా నల్సా (నేషనల్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ) పిలుపు మేరకు జిల్లా కోర్టులో గురువారం బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కేసుల త్వరితగత పరిష్కారానికి మీడియేషన్‌ ఉపయోగపడుతుందని, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు మీడియేషన్‌పై ఆధారపడుతున్నాయని తెలిపారు. పేరుకుపోతున్న కేసుల పరిష్కారానికి నేషనల్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ మీడియేషన్‌ ప్రక్రియకు ప్రాధాన్యమిస్తోందన్నారు. సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్‌రావు, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల సాయిరెడ్డి, మాణిక్‌రాజ్‌, వివిధ కోర్టుల జడ్జీలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పెయిడ్‌ పార్కింగ్‌ ఏరియాగా రాజీవ్‌గాంధీ ఆడిటోరియం

- సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం (ఆర్‌జీఏ)లో పెయిడ్‌ పార్కింగ్‌ ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ పోతరాజు సాయి చైతన్య పేర్కొన్నారు. ఖలీల్‌వాడి ఏరియాలో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్‌ సమస్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఐఎంఏ సభ్యులతో కలిసి గురువారం కమిషనరేట్‌ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలను సమన్వయ పరుచుకుంటూ త్వరలోనే సెక్యూరిటీ కౌన్సిల్‌ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కౌన్సిల్‌ భవిష్యత్తులో అన్నిరకాల సమస్యలపై తక్షణ పర్యవేక్షణ చేసి వాటి నివారణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో పెయిడ్‌ పార్కింగ్‌ ఏర్పాటు చేసి 24 గంటల వ్యవధికి కారుకు రూ.50, ఆటోకు రూ.30, ద్విచక్ర వాహనానికి రూ.20 చార్జి విధించనున్నట్లు వెల్లడించారు. ఈ సౌకర్యంపై ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లు, వారి బంధువులకు తెలపాలని వైద్యులకు సూచించారు. అంతకుముందు ట్రాఫిక్‌, రాంగ్‌ పార్కింగ్‌, సెల్లార్‌ పార్కింగ్‌పై చర్చించారు. ఆస్పత్రుల పరిధిలో ఉన్న మెడికల్స్‌, పార్కింగ్‌ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, ఎంక్రోచ్‌మెంట్లు, అంబులెన్స్‌లపై సంబంధిత డాక్టర్లతో చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ మెడికల్‌ గైడ్‌లైన్స్‌ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సమావేశంలో డీసీపీ(అడ్మిన్‌) బస్వారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ , మున్సిపల్‌ అదనపు కమిషనర్‌ రవి, ఐఎంఏ ప్రెసిడెంట్‌ అజ్జ శ్రీనివాస్‌, ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ, డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రచారం సరే.. భద్రత ఏదీ?

ఆర్మూర్‌ టౌన్‌: వస్త్రాలపై ఆఫర్‌ అంటూ ఓ దుకాణ నిర్వాహకులు సోషల్‌ మీడియాలో ప్రచారం చేశారు. కానీ కొనుగోలుదారులకు తగిన భద్రత చర్యలు చేపట్టకపోవడంతో గందరగోళం నెలకొంది. పట్టణంలోని ఓ వస్త్ర దుకాణ యజమానులు సోషల్‌ మీడియాలో రూ.పదికే షర్టు, రూ.పదికే ప్యాంట్‌ అంటూ ప్రచారం చేశారు. దీంతో వివిధ గ్రామాల ప్రజలు గురువారం ఉదయం నుంచే దుకాణం ఎదుట బారులు తీరారు. ఈక్రమంలో ట్రాఫిక్‌ అంతరాయం ఏర్పడటంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దుకాణం ఎదుట ఉన్న ప్రజలను చెదరగొట్టారు. అనంతరం దుకాణానికి తాళం వేసి, దుకాణ యజమానులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపారు. వేలాది మంది ఒక్కసారిగా దుకాణంలోకి వెళ్తే తోపులాటలో ప్రాణాలకు ముప్పు పొంచిఉంటుందని పలువురి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఆఫర్లు ప్రకటిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



ఆర్మూర్‌లోని వస్త్ర దుకాణం ఎదుట బారులు తీరిన యువకులు

కానిస్టేబుళ్లకు ప్రమోషన్‌

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని పలువురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించినట్లు సీపీ సాయిచైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రమోషన్‌ పొందిన హెడ్‌కానిస్టేబుళ్లకు సీపీ శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో సీహెచ్‌. రాములు(సిరికొండ), పి.కిరణ్‌గౌడ్‌ (ఇందల్వాయి), కె.కిషన్‌ (డిచ్‌పల్లి), పి.అర్జున్‌ (నిజామాబాద్‌ రూరల్‌), ఎస్‌.సత్పాల్‌ (ట్రాఫిక్‌ పీఎస్‌, నిజామాబాద్‌), టి.శ్రీనివాస్‌ (ట్రాఫిక్‌ పీఎస్‌, నిజామాబాద్‌), డి.సీనా (రైల్వే, నిజామాబాద్‌), బి.శ్రీనివాస్‌ (సైబర్‌ క్రైమ్‌ పీఎస్‌ నిజామాబాద్‌), కృష్ణయ్య (రైల్వే, నిజామాబాద్‌)లు ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

నందిపేట్‌(ఆర్మూర్‌): మండలంలోని కుద్వాన్‌పూర్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తరచుగా తరగతి గదిలో నిద్రపోతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సదరు ఉపాధ్యాయుడు తరగతి గదిలో నిద్రపోగా విద్యార్థుల తల్లిదండ్రులు ఫొటో, వీడియోలు తీసి జిల్లా విద్యాశాఖ అధికారికి పంపారు. అధికారులు టీచర్‌తోపాటు హెచ్‌ఎంకు నోటీసులు జారీచేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న శంకర్‌ విద్యార్థులపై ఆగ్రహం పెంచుకుని కళ్లల్లో, చెవుల్లో కారం పోసినట్లు తెలిసింది. దీంతో గ్రామస్తులు గురువారం బడికి వెళ్లగా, ఉపాధ్యాయుడు సెలవుపై ఉండటంతో మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎంఈవోను వివరణ కోరగా విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో గోదావరి గట్టున గుర్తుతెలియని మహిళ మృతదేహం గురువారం సాయంత్రం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై జాదవ్‌ సుహాసిని ఘటన స్థలానికి చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. ప్రాజెక్ట్‌ అతిథి గృహం వెనకాల గల బాబా సమాది పక్కన గోదావరి అంచున మహిళ మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వయస్సు సుమారు 35 ఏళ్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి ఒంటిపై గోదుమ రంగులోని చీరపై చుక్కలు ఉన్నాయన్నారు. నాలుగు రోజుల క్రితం నుంచి గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో మృతదేహం కొట్టుకువచ్చి ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



క్రైం కార్నర్‌

చెట్టును ఢీకొన్న బైక్‌: ఒకరి మృతి

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొని, అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన అఖిల్‌ (26) గురువారం తెల్లవారుజామున ప్రాజెక్ట్‌ జాతీయ రహదారి 44 చౌరస్తా నుంచి పోచంపాడ్‌కు బైక్‌పై బయలుదేరాడు. ప్రాజెక్ట్‌ రోడ్డుపై ప్రమాదవశాత్తు చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మెండోరా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాజెక్టు రోడ్డుపై లైట్లు కొంతకాలంగా వెలగడం లేదు. దీంతో తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన అట్టిమల్ల శ్రీనివాస్‌గౌడ్‌ అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఉదయం కల్లు గీత కోసం తాటి చెట్టు ఎక్కగా జారి కిందపడటంతో కాలుకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ఇతను గతంలో కూడా చెట్టు పైనుంచి పడి గాయాల పాలయ్యాడు. బాధితుడిని దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

జూదరుల అరెస్టు

రెంజల్‌(బోధన్‌): మండలంలోని కందకుర్తి శివారులో పేకాట స్థావరంపై గురువారం దాడి చేసినట్లు ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పేక ముక్కలతోపాటు రూ. 3220ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని నూత్‌పల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో ఎస్సై శ్యామ్‌రాజ్‌ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేయగా పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.39,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నారు.

జూలైలో 1708 డ్రంకన్‌డ్రైవ్‌ కేసులు

- 77 మందికి జైలు శిక్షలు
- 62 డ్రైవింగ్‌ లైసెన్సుల సస్పెండ్‌

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో జూలైలో 1708 డ్రంకన్‌డ్రైవ్‌ కేసులు నమోదు అయినట్లు నిజామాబాద్‌ సీపీ సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడ్డ 1708 మందిలో 966 మంది నిందితులపై అభియోగాలు మోపుతూ చార్జిషీట్‌లు కోర్టులో వేయగా వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు చెప్పారు. ఇందులో 77 మందికి జైలు శిక్షలు విధించగా, మిగతా కేసులలో జరిమానాలు విధించినట్లు తెలిపారు. వాహనాలు నడిపిన వారి డ్రైవింగ్‌ లైసెన్స్‌ సస్పెండ్‌ చేయమని ఆర్టీఏ అధికారులను కోరగా జులై నెలలో 62 డ్రైవింగ్‌ లైసెన్స్‌లను సస్పెండ్‌ చేసినట్లు ఆయన తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ట్రాఫిక్‌ పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా, మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మంది పట్టుబడ్డారు. వారికి నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌లో ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ గురువారం కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపర్చారు. జడ్జి వారిలో 18 మందికి రూ. 22వేల జరిమానా విధించగా, ఇద్దరికి 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

ధర్పల్లి: పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా, మండలానికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. అతడిని గురువారం నిజామాబాద్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరు పరచగా, జడ్జి అతడికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు.

యాపిల్స్‌ డీసీఎం బోల్తా



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌ వద్ద జాతీయ రహదారి 44పై గురువారం ఉదయం హైదరాబాద్‌ వెళ్తున్న యాపిల్స్‌ లోడ్‌ డీసీఎం వ్యాన్‌ బోల్తా పడింది. అతి వేగంగా రావడంతో అదుపు తప్పి బోల్తాపడగా డ్రైవర్‌, క్లీనర్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో హైవేపై 45 నిమిషాల పాటు ట్రాఫిక్‌ నిలిచి పోయింది. హైవే సిబ్బంది స్పందించి క్రేన్‌ సాయంతో వ్యాన్‌ను తొలగించారు. వేరే వాహనంలో యాపిల్స్‌ను తరలించారు. వారం క్రితం నిర్మల్‌ వైపు వెళ్తున్న బొప్పాయి లోడ్‌ డీసీఎం వ్యాన్‌ ఇక్కడనే బోల్తా పడింది.

నగరంలో బాలుడి ఆత్మహత్య



రాజేశ్వర్‌ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని రోటరీనగర్‌లో ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు నాలుగోటౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. వివరాలు ఇలా.. రోటరీనగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు ఒక కూతురు, ఒక కొడుకు రాజేశ్వర్‌(15) ఉన్నాడు. రాజేశ్వర్‌ ప్రస్తుతం పదో తరగతి ఫెయిల్‌ అయినప్పటికీ సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసయ్యాడు. అనంతరం ఇంటర్‌లో చేరాలని తల్లిదండ్రులు చెప్పినప్పటికీ రాజేశ్వర్‌ వినలేదు. చదువుపై ఆసక్తి లేకపోవడంతో రాజేశ్వర్‌ గురువారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- బ్యాంక్‌ లోన్‌ ఇప్పిస్తామంటూ బంగారం, నగదు చోరీ
- ఐదు జిల్లాల్లో వెలుగుచూసిన ఘటనలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేష్‌ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్‌ చంద్ర

కామారెడ్డి క్రైం: సుమారు ఐదు జిల్లాల్లో బ్యాంక్‌ లోన్‌ ఇప్పిస్తామంటూ బాధితులను ఏమర్చి బంగారం, నగదు చోరీకి పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను కామారెడ్డి జిల్లా భిక్కనూరు పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్‌ చంద్ర వివరాలు వెల్లడించారు. భిక్కనూర్‌కు చెందిన ఊరె లక్ష్మి దంపతులు స్థానికంగా బొంబు మర్చంట్‌ దుకాణం నడుపుతున్నారు. ఫిబ్రవరి 26న లక్ష్మి దుకాణంలో ఉండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మాటలు కలిపాడు. బ్యాంకు నుంచి వచ్చానని, మీ దుకాణంపై రుణం ఇప్పిస్తామని నమ్మించి లక్ష్మిని బ్యాంకుకు తీసుకువెళ్లాడు. పేదవారిగా కనిపిస్తేనే బ్యాంకు అధికారులు రుణం ఇస్తారని, మెడలోని బంగారు గొలుసు తీసేయాలని చెప్పారు. లక్ష్మి మెడలోని 3 తులాల బంగారం గొలుసును తీయగా, మేనేజర్‌ వద్దకు వెళ్లి వచ్చేదాకా తన వద్ద భద్రంగా ఉంచుతానని నమ్మబలికాడు. ఆమె దృష్టిని మళ్లించి అక్కడ నుంచి ఉడాయించాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, భిక్కనూర్‌ పోలీసులు విచారణ ప్రారంభించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన అఫ్తాబ్‌ అహ్మద్‌ షేక్‌, ఫహీమా బేగం అనే భార్యా భర్తలు కబీరుద్దీన్‌, దీపక్‌ కిసాన్‌ సలుంకే అనే మరో ఇద్దరితో కలిసి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. భిక్కనూర్‌ టోల్‌ గేట్‌ వద్ద ఒకరిని, కామారెడ్డిలో ముగ్గురిని అరెస్ట్‌ చేశారు. నిందితులు భిక్కనూర్‌తోపాటు ఆదిలాబాద్‌, నిర్మల్‌, హైదరాబాద్‌, సిద్దిపేట జిల్లాల్లో ఈ తరహాలో మొత్తం 8 నేరాలు చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి బంగారు గొలుసు, రెండు కార్లు, ఓ ద్విచక్రవాహనం, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసు, ఫోన్‌లు

పట్టించిన బైక్‌ నెంబర్‌ ప్లేట్‌..

అఫ్తాబ్‌ అహ్మద్‌ షేక్‌పై గతంలో 60 పైగా దృష్టి మళ్లింపు, చోరీ కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పలు కేసుల్లో జైలుకు వెళ్లివచ్చినా చోరీలు చేస్తూనే ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు ఐదు జిల్లాల పోలీసులు చాలాకాలంగా గాలిస్తున్నా తప్పించుకు తిరుగుతున్నాడు. కొద్దిరోజుల క్రితం ఈ నేరస్తుడి గురించి దొంగ చిక్కడం లేదంటూ పలు టీవీ చానెళ్లలో వార్తా కథనాలు సైతం వచ్చాయన్నారు. ఇదిలా ఉండగా కేసులో ప్రధాన నిందితుడైన అఫ్తాబ్‌ అహ్మద్‌ షేక్‌ తప్పుడు నెంబర్‌ ప్లేట్‌తో ఉన్న బైక్‌ను వాడి పోలీసులకు చిక్కాడు. అతడు వాడిన బైక్‌ ముందర ఒక నెంబర్‌, వెనుక భాగంలో మరో నెంబర్‌ ఉండటాన్ని గమనించిన భిక్కనూర్‌ పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. జిల్లాలో ఇప్పటివరకు ఫేక్‌ నెంబర్‌ ప్లేట్‌లతో తిరుగుతున్న వాహనాలను పట్టుకుని 6 కేసులను ఛేదించినట్లు ఎస్పీ తెలిపారు. అందుకే వాహనాల తనిఖీలపై ఎక్కువగా దృష్టి పెట్టామన్నారు. కేసు ఛేదనకు కృషి చేసిన భిక్కనూర్‌ సీఐ సంపత్‌ కుమార్‌, సీసీఎస్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సైలు ఆంజనేయులు, ఉస్మాన్‌, కానిస్టేబుళ్లు రవి, రాజేందర్‌, మైసయ్య, రమేష్‌ యాదవ్‌, మేకల నరేష్‌, జి నరేష్‌ లను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ నరసింహరెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.